క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామికి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

వేడుకగా సీతారాముల రథోత్సవం



రథంపై కొలువుదీరిన సీతారాములు

పొదలకూరు : పట్టణంలోని శ్రీరామ మందిరంలో జరుగుతున్న నవమి వేడుకల్లో భాగంగా గురువారం వేడుకగా రథోత్సవం నిర్వహించారు. తరుగు గురవయ్య, రామయ్యలు 1986లో రథోత్సవాన్ని ప్రారంభించగా, అప్పటి నుంచి వారి కుటుంబ సభ్యులు నిరంతరాయంగా ప్రతి ఏటా కొనసాగిస్తున్నారు. పట్టణంలో సాగిన రథోత్సవంలో మహిళా భక్తులు కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మంత్రి కాకాణి పరామర్శ



అశోక్‌కుమార్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అశోక్‌కుమార్‌రెడ్డిని గురువారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నెల్లూరులో పరామర్శించారు. అశోక్‌కుమార్‌రెడ్డి అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండగా, విషయం తెలుసుకున్న మంత్రి అందుకు గల కారణాలను అడిగి తెలుసుకుని విశ్రాంతి తీసుకోవాల్సిందిగా సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

వెంకటాచలం : పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కురిచెర్లపాడు గ్రామంలో గురువారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. అని ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, వృద్ధులు జగనన్న పాలనలో తాము సంతోషంగా ఉన్నామని సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి కాకాణి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తున్నారని కొనియాడారు.

మద్దతు ధర ఉండడం టీడీపీకే అసంతృప్తి

ప్రస్తుతం పండించిన ధాన్యానికి మద్దతు ధర కంటే అధికంగా రైతులు అమ్ముకుంటూ సంతోషంగా ఉంటే, టీడీపీ నేతలు మాత్రమే అసంతృప్తిగా ఉన్నారని మంత్రి కాకాణి చెప్పారు. వారి ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు అవకాశం లేకపోవడంతో సోమిరెడ్డి చాలా అసంతృప్తిగా ఉన్నాడని విమర్శించారు. గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా వెలగబెట్టిన ఆయన ఏనాడైనా సాగునీరు, మద్దతు ధర గురించి పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పిన బాబు నమ్మించి మోసం చేస్తే, రైతు భరోసా పథకం ద్వారా పేద రైతులకు ఆర్థిక భరోసా ఇస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో రూ.22.30 లక్షలతో మౌలిక వసతులు కల్పించిన పనులను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుస్మిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, వెంకటరమణయ్య, సర్పంచ్ అర్బర్‌బాషా పాల్గొన్నారు.

ప్రజల మద్దతు సీఎం జగన్‌కే



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : సంక్షేమ పథకాల అమలుతో ప్రజల మద్దతు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పగటి కలలు కంటున్నారన్నారు. పొత్తు కోసం అటు పవన్, ఇటు మోదీని కలిసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాడని దుయ్యబట్టారు. బాబుది వెన్నుపోటు రాజకీయమని, ఇకనైనా నీచ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఎన్ని ఎత్తులు వేసినా ప్రజలు మాత్రం బాబును నమ్మే పరిస్థితి లేదన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మేలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉంటారన్నారు. చంద్రబాబుకు ఎన్నికలు వస్తేనే తమ్ముళ్లు గుర్తుకొస్తారన్నారు. అప్పట్లో బాబు సీఎం అయిన తరువాత ఎన్టీఆర్ ఫొటో పుస్తకాల్లో లేకుండా చేయాలని చూశారని, అయితే నాటి మాజీ మంత్రి రమేష్‌రెడ్డి, శ్రీపతి రమేష్ వంటి వారు తిరుగుబాటు చేస్తే మరలా ఎన్టీఆర్ ఫొటో పెట్టారన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, నేతలు ఉడతా వెంకటశేషయ్య, కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, షబ్బీర్ పాల్గొన్నారు.

సంక్షేమంలో అన్నివర్గాలకు ప్రాధాన్యం

- ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశేషాదరణ
- ఎమ్మెల్యే ప్రసన్న వెల్లడి



ఇందుకూరుపేట : ప్రభుత్వ పాలనకు మద్దతు ఇస్తున్న లబ్ధిదారుడు, చిత్రంలో ఎమ్మెల్యే ప్రసన్న

ఇందుకూరుపేట : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో అన్నివర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తోందని, దీని వల్ల ప్రజల్లో ప్రభుత్వం పట్ల విశేషాదరణ దక్కుతోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరులో గురువారం 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించారు. వారి అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గోడలకు అతికించారు. నేటి ప్రభుత్వ పాలనపై ఐదు ప్రశ్నలు ఉన్న పత్రాలపై సమాధానాలను పూరించాలన్నారు. జగనన్న పాలనకు మద్దతుగా సెల్‌ఫోన్‌తో మిస్డ్‌కాల్ ఇవ్వాలని కోరారు. 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతిరోజు 30 నుంచి 50 ఇళ్లను సందర్శించాలని కోరారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మండలంలోని 866 సంఘాల్లో 9,006 మంది సభ్యులకు రూ.7.61 కోట్ల ఆసరా నమూనా చెక్కును ప్రసన్న పాదువు మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, పాదువు మహిళలు పాల్గొన్నారు.

ఎరువుల గోదాము ప్రారంభం

ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ ఆవరణలో రూ.40 లక్షలతో నిర్మించిన ఎరువుల గోదామును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, పాలకవర్గ సభ్యులు చిట్టిబోయిన కృష్ణప్రసాద్, సంగం వెంకయ్య, కార్యనిర్వహణాధికారి మహేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను గుర్తించండి



మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు : 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరిగే గ్రామాల్లో అత్యవసర అభివృద్ధి పనులను గుర్తించాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. మండలంలో ఈనెల 15 నుంచి జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై అధికారులు, నాయకులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు కేటాయిస్తున్నందున ఆ నిధులతో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను గుర్తించాలని చెప్పారు. ఈనెల 15న కొడవలూరు, 16న యల్లాయపాళెం, 17న కొడవలూరులో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జి.వసంతకుమారి, ఏఈలు ఎ.రమేష్, పి.సురేష్‌కుమార్, తాతారావు, నేతలు సునీత, తిరుపతమ్మ, ఎస్.నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, టి.భాస్కర్ పాల్గొన్నారు.

వేరుశనగ తోటలో పంటకోత ప్రయోగం



దిగుబడిని అంచనా వేస్తున్న ప్రణాళికాధికారులు

ముత్తుకూరు : రబీ సీజన్‌లో వేరుశనగ పంటకు సంబంధించి సాధారణ దిగుబడి వచ్చినట్లు జిల్లా ప్రణాళికాధికారులు అంచనా వేశారు. ముత్తుకూరు పంచాయతీలోని బోడిస్వామికండ్రిగ భూముల్లో వేరుశనగ పంటకోత ప్రయోగం గురువారం నిర్వహించారు. క్షేత్రస్థాయి పంట దిగుబడిపై అంచనా వేశారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి సాల్మన్‌రాజు, ఉప గణాంక అధికారి శోభారాణి తదితరులు వేరుశనగ పొలంలో 25 చదరపు అడుగుల విస్తీర్ణంలో కోతలు నిర్వహించారు. ఈ కోతల ద్వారా వచ్చిన వేరుశనగ కాయలను తూకం వేయగా, 18.500 కిలోల మేరకు దిగుబడి వచ్చింది. ఇది సాధారణ దిగుబడి అని నిర్ధారించారు. మండల ఏఎస్ఓ వాసుదేవరావు, వీఏఏలు చందనాకుమారి, జగదీష్, నవీన్‌లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు సత్వరమే పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణ

మనుబోలు : ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ కృష్ణ సిబ్బందికి సూచించారు. వెంకటాచలం తహసీల్దార్‌గా ఉన్న కృష్ణ గురువారం మనుబోలు తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. రోజుల తరబడి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. ఆదాయ, కుల ఇతర ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేయవద్దని సూచించారు. డీటీలు శ్రీకాంత్‌రెడ్డి, బాలకోటమ్మ, వీఆర్వోలు ఉన్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు



బుచ్చిరెడ్డిపాళెం : చెల్లాయపాళెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు



పొదలకూరు : దుగ్గుంటరాజుపాళెం గ్రామంలో..

- గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్' ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తామని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యుడు షేక్.అహ్మద్‌బాబు అన్నారు. మండలంలోని చెల్లాయపాళెంలో గురువారం స్థానిక సర్పంచ్ రావూరు రజనీకాంత్‌తో కలిసి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దీని ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి అనారోగ్యంగా ఉన్నవారికి ఉచితంగా మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. అలాగే మందులను కూడా పంపిణీ చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణ, ఆరోగ్య సిబ్బంది సుబ్బారెడ్డి, సుబ్బమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దుగ్గుంటరాజుపాళెంలో..

పొదలకూరు : మండలంలోని దుగ్గుంటరాజుపాళెం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను గురువారం వైద్యాధికారి డాక్టర్ రమేష్ పర్యవేక్షణలో ప్రారంభించారు. సర్పంచ్ కన్నెమేకల రమణయ్య చేతులమీదుగా కార్యక్రమాన్ని ఆరంభించారు. ఇంటింటికి వెళ్లి వైద్యసేవలను అందిస్తామని ఈ సందర్భంగా వైద్యాధికారి వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, డాక్టర్ వి.నరసింహారావు, డాక్టర్ కిరణ్‌రిషిత, ఆరోగ్యశాఖ అధికారులు ఆంజనేయవర్మ, రవికుమార్, కె.శ్రీనివాసులు, కె.అనూరాధ, ఉద్యోగులు రమణమ్మ, వి.సుప్రియ, రామసుబ్బులు, రెహమాన్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి



కిషన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న జొన్నవాడ ఆలయ చైర్మన్

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆలయంలో తలపెట్టిన రూ.27 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు.

నేడు వెంకటాచలంలో మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంకటాచలంలో శుక్రవారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు వెంకటాచలం పంచాయతీ పరిధిలోని వడ్డిపాళెం చేరుకుని 'జగనన్న నువ్వే మన భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు ఇస్లాంపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

పూరిల్లు దగ్ధం

వెంకటాచలం : గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని కనుపూరులో గురువారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన చిన పెంచలయ్య నివాసంలో కుటుంబసభ్యులు వంట చేసే నిమిత్తం గ్యాస్ స్టౌవ్‌ను వెలిగించగా, గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పూరిల్లు కావడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందాయి. స్థానికులు మంటలు ఆపే ప్రయత్నం చేసినా పూర్తిగా కాలిపోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

మూడు వాహనాలకు వేలం

కోవూరు : వివిధ కేసుల్లో సీజ్ అయిన మూడు వాహనాలకు కోవూరు సెబ్ కార్యాలయంలో గురువారం వేలంపాట నిర్వహించారు. జీఎస్టీతో కలిపి రూ.51,910 వసూలైనట్లు సెబ్ సీఐ నరహరి తెలిపారు.

దుకాణం కూల్చివేతపై ఫిర్యాదు



ముత్తుకూరు : ముత్తుకూరు సెంటర్‌లో 28 ఏళ్లుగా నడుపుతున్న తన కూల్‌డ్రింక్స్, టీ, తినుబండారాల దుకాణాన్ని బుధవారం అర్ధరాత్రి కొందరు యంత్రాలతో అక్రమంగా కూల్చివేశారని కోనేటిమిట్టకు చెందిన షేక్.రిజ్వాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ దుకాణ స్థల వివాదంలో ఉన్న ముగ్గురు స్థానిక వ్యక్తులు దుశ్చర్యకు పాల్పడ్డారని, దీనివల్ల విలువైన ఫ్రిజ్‌లు, తినుబండారాలు ధ్వంసమయ్యాయని, రూ.2 లక్షల నగదు చోరీకి గురైందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనికి కారకులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

శారీరక పెరుగుదలకు పౌష్టికాహారం దోహదం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

కొడవలూరు : పిల్లల్లో శారీరక పెరుగుదలకు మధ్యాహ్న భోజనంలో ఇచ్చే పౌష్టికాహారం దోహదపడుతుందని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. కొడవలూరు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ వసంతకుమారితో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంతో పాటు పోషకాలుండే రాగి జావ, గుడ్డు, చిక్కీలు ఇస్తున్నందున చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యకరంగా పెరిగేందుకు ఉపకరిస్తాయన్నారు. వారి వెంట హెచ్‌ఎం టి.లక్ష్మీభవాని, సీఆర్పీ జె.పెంచలరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను వివరించాలి

పొదలకూరు : గృహసారథులు ప్రతిఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు పథకాలు అందని వారిని గుర్తించాలని మండల సచివాలయ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తాటిపర్తి బిట్–1, 2 సచివాలయ పరిధిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు గురువారం జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మా నమ్మకం నువ్వే జగన్ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లను సమన్వయపరుచుకుని ఇంటింటికి వెళ్లాల్సిందిగా సూచించారు. ఉప సర్పంచ్ పామూరు లచ్చారెడ్డి, నారాయణరెడ్డి, పి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

ముత్తుకూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన రెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లపూడి సచివాలయ పరిధిలో వలంటీర్లు, గృహ సారథులకు జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అందుకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. గృహసారథులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, సర్పంచ్ కె.మస్తానమ్మ, ఉపసర్పంచ్ ఎ.గోపాల్, డి.హరికృష్ణ, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.



పొదలకూరు : గృహసారథులకు కిట్‌ను అందజేస్తున్న నేతలు

ప్రజల్లోకి తీసుకెళ్లండి

తోటపల్లిగూడూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల సచివాలయాల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డితో కలిసి ఆయన గురువారం మండలంలోని పొట్లపూడి, విలుకానుపల్లి, చింతోపు, ముంగళదొరువు, ఈదూరు గ్రామ సచివాలయాల గృహసారథులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రచార సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ నేతలు టి.పద్మనాభరెడ్డి, సి.శ్రీనివాసులునాయుడు, టి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, సి.సరళకుమారి, సురేష్‌రెడ్డి, ఎల్.మల్లి, సతీష్ పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

కోవూరు : 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి కోరారు. మండలంలోని పోతిరెడ్డిపాళెంలో గృహసారథులతో గురువారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం ప్రచార సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, సర్పంచ్ శ్రీవాణి, మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, సుప్రజ పాల్గొన్నారు.



ముత్తుకూరు : కరపత్రాలు అందజేస్తున్న నేతలు

- **బుచ్చిరెడ్డిపాళెం :** బుచ్చి పట్టణంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమ కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలు వినోద్, కార్తీక్ పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : ప్రచార సామగ్రిని అందజేస్తున్న పార్టీ నేతలు



కోవూరు : సామగ్రిని అందజేస్తున్న డీఏఏబీ చైర్మన్



బుచ్చిరెడ్డిపాళెం : కిట్లను అందజేస్తున్న నేతలు